క్లుప్తంగా

బ్యాంకుల వద్ద పండుటాకుల అవస్థలు



తెనాలి అర్బన్: బ్యాంకుల వద్ద పండుటాకులు శుక్రవారం అవస్థలు పడ్డారు. ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్లను ఎలక్షన్ కమిషన్ బ్యాంకుల్లో జమ చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో అధికారులు వృద్ధాప్య, వింతతు, వికలాంగ, ఒంటరి మహిళ పింఛన్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. విషయం తెలుసుకున్న లబ్ధిదారులు పట్టణంలోని తమ ఖాతాలు ఉన్న బ్యాంకులకు వెళ్ళి అనేక అవస్థలు పడుతున్నారు. బ్యాంకులో విత్‌డ్రా ఫామ్‌లు రాసేవారు లేక క్యూలో నిలబడలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితికి కారణమైన చంద్రబాబు నాయుడు పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో వార్డు వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం తెనాలి పట్టణంలోని పలు సచివాలయాలకు చెందిన 23మంది తమ ఉద్యోగానికి రాజీనామా చేశారు. వాటిని సచివాలయ అడ్మిన్‌లకు అందజేశారు. పినపాడు-1 సచివాలయ పరిధిలో 4, మారీసుపేట-2 సచివాలయ పరిధిలో 1, మారీసుపేట-1 సచివాలయ పరిధిలో 7, సాలీపేట-1 సచివాలయ పరిధిలో 11 మంది వలంటీర్లు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. రాజీనామాలను ఆమోదించినట్లు కమిషనర్ బండి శేషన్న తెలిపారు.

నేడు తెనాలి పట్టణంలో రోడ్ షో

తెనాలి అర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గంటలకు తెనాలి పట్టణ పరిధిలోని 8, 9, 10,11 వార్డుల్లో రోడ్ షో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. రోడ్ షోలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రారంభమైన హోం ఓటింగ్



తెనాలి రూరల్: ఎన్నికల సంఘం కొత్తగా రాష్ట్రంలో అమలు చేస్తున్న హోమ్ ఓటింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. 8వ తేదీ వరకు జరగనున్న హోం ఓటింగ్‌లో 12-డీ ఫారంతో దరఖాస్తు చేసుకున్న 85 ఏళ్ల నిండి, దివ్యాంగుల ఇళ్ల వద్దకే వెళ్లి అధికారులు హోం ఓటింగ్ చేయిస్తున్నారు. తొలి రోజు మొత్తం 13 బృందాలు హోం ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నాయి. 116 మంది తమ ఇళ్ల వద్దనే ఓటు హక్కును వినియోగించుకున్నారు. తెనాలి నియోజకవర్గంలో ఫారం 12-డి దరఖాస్తులు 352 వచ్చాయి. 8వ తేదీ వరకు జరిగే ఓటింగ్ ద్వారా ఆయా ఓటర్లు తమ ఓటు హక్కును ఇళ్ల వద్దనే వినియోగించుకోనున్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: అధ్యాపకుల లక్ష్య సాధనకు తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాల అధ్యాపకుడు యంపరాల సుమంత్‌కు అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసిందని తెలిపారు. పర్ఫార్మెన్స్ ఎన్‌హాన్స్‌మెంట్ ఆఫ్ డబుల్ ఫెడ్ ఇండక్షన్ జనరేటర్ బేస్డ్ విండ్ ఎనర్జీ కన్వర్షన్ సిస్టమ్ బై ఆప్టిమల్ డిజైన్ ఆఫ్ ఎఫ్‌ఓపీఐడీ కంట్రోల్ అనే అంశంపై డాక్టర్ ఎల్.లక్ష్మినరశింహన్, డాక్టర్ జి.సాంబశివరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

పూడికతీత పనులు

ఫిరంగిపురం: మండలంలోని 17 గ్రామాల్లో ఉపాధిహామీ పనులు వేగంగా జరుగుతున్నాయి. వర్షాకాలంలో పంట కాలువల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధి కూలీలు పూడికతీత పనులు చేపడుతున్నారు. అన్ని గ్రామాల్లో పంట కాలువల పూడికతీత పనులతో పాటు పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసేందుకు వీలుగా తవ్వకాలు నిర్వహిస్తున్నామని ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు.

చంద్రబాబువి బూటకపు హామీలు

- అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం ఇవ్వండి
- ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం
- తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్



అన్నవరం గ్రామంలో రోడ్ షో లో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్

బొమ్మువారిపాలెం(కొల్లిపర): చంద్రబాబువి బూటకపు హామీలేనని, ఆ హామీలు నమ్మి ప్రజలు మోసపోవద్దని తెనాలి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ కోరారు. అభివృద్ధి, సంక్షేమం అందించిన వైఎస్సార్‌సీపీ మరో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని హనుమాన్‌పాలెం, బొమ్ము వారిపాలెం, అన్నవరం, అన్నవరపు లంక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం భాగంలో ఆయా గ్రామ నాయకులతో కలసి రోడ్ షో నిర్వహించారు. ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్‌కు పార్టీ నాయకులు,ప్రజలు అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ప్రధాన పార్టీ నాయకులు శివకుమార్ కి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. మహిళలు హారతులు ఇచ్చి అహ్వానించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి చేసిన వారిని గుర్తించాలన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని ఓటర్లకు సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం నవరత్నాలు ద్వారా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. అవి యాథావిధిగా కొనసాగాలంటే వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కులం, మతం, ప్రాంతం బేధాలు లేకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కరోనా కష్టకాలంలో సైతం సంక్షేమం పథకాలు అందించి ప్రజలకు అండగా నిలిచామన్నారు.మాట ఇస్తే ఎంత కష్టమైనా మాట మీద నిలబడే వ్యక్తి సీఎం జగన్ అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ని ఎదుర్కొనే సత్తా లేకనే దొంగల ముఠా అంతా కూటమిగా ఏర్పడిందన్నారు. 2014 ఎన్నికల్లో మాదిరే దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి రావాలని చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.ప్రజలు అప్రమత్తంగా లేకపోతే మళ్లీ మోసపోవాల్సి వస్తుందన్నారు. చంద్రబాబు , పవన్‌కళ్యాణ్ విడుదల చేసిన మేనిఫెస్టోను బీజేపీ నాయకులే నమ్మడం లేదన్నారు.ఇక ప్రజలు ఎలా నమ్ముతారని ఎద్దేవా చేశారు. ప్రతి గ్రామంలో ప్రతి గడపగడపకూ ఈ ఐదేళ్లలో మంచి చేశాం కనుకే మీ ఇంట్లో మంచి జరిగిఉంటేనే ఓటు వేయమని ధైర్యంగా అడుగుతున్నామన్నారు. ప్రజలకు ఇది చేశామని చెప్పే ధైర్యం చంద్రబాబుకు, కూటమి అభ్యర్థులకు ఉందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, సర్పంచ్‌లు తాత శ్రీలక్ష్మి, తోడేటి రాజేశ్వరి, ఎంపీటీసీ తుమాటి భీమారాణి ,పార్టీ నాయకులు బొమ్ము శ్రీనివాసరెడ్డి, బాజి, దాసరి అనీల్, మైలా శ్రీనివాసరావు , తాత శ్రీను, శీలం శ్రీనువాసరావు ,పండిపాటి బాబు, బొమ్ము నాగవెంకటేశ్వరరెడ్డి , తోడేటి దాసు ,గురివిండపల్లి గిరిబాబు తోడేటి జయాకర్, ఆరిగ చంద్రారెడ్డి, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హనుమాన్‌పాలెం రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్

జగన్ అంటేే ప్రజలకు నమ్మకం



ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి పుష్ప, ఎంపీ అభ్యర్థి కుమార్తె విజయ సాయి



21వ వార్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి పుష్ప, చైర్‌పర్సన్ రాధిక

తెనాలి అర్బన్: జగన్ అంటే రాష్ట్ర ప్రజలకు నమ్మకం, భరోసా అని, అవే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అఖండ మెజారిటీతో గెలిపిస్తాయని వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. 21వ వార్డు మారీసుపేట కొత్తవంతెన నుంచి శుక్రవారం సాయంత్రం పుష్పతో పాటు గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య కుమార్తె కిలారి విజయ సాయి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి కరపత్రాలు పంపిణీ చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ రీయాజ్‌ఖాన్, కావేటి నిర్మల, యలవర్తి గీతాదేవి, కఠారి హరీష్, నీలి అజయ్‌కుమార్, మద్దిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి, సుభానీ, సైదా, వెంకటరెడ్డి, జానర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అచ్చిరెడ్డి, నన్నె బాబు, సందానీ, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థిపై పోలీసుల దాడి

తెనాలి రూరల్: తెనాలి పోలీసులు విద్యార్థిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారని మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది పొందుగుల చైతన్య ఆరోపించారు. తెనాలి పోలీస్ కంట్రోల్‌రూమ్‌లో ఏఎస్‌ఐగా పని చేస్తున్న శ్రీనివాసరావు ఏప్రిల్ 30వ తేదీన విధుల్లో భాగంగా డీఎస్పీ కార్యాలయానికి వెళుతుండగా బస్టాండ్ నుండి వీఎస్సార్ కళాశాలకు వెళ్లే రోడ్డులో సిగరెట్ కొట్టు వద్ద కొందరు యువకులు ఉండడాన్ని గమనించారు. యువకులను వారించి పంపించి తన స్కూటీపై వెళుతుండగా వెనుక నుండి వాహనాలపై వచ్చిన యువకులు శ్రీనివాసరావును నెట్టడంతో కింద పడి తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ విషయమై టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఘటనకు తెనాలి పట్టణానికి చెందిన డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి శశాంక్ కారణమంటూ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని రెండు రోజులు స్టేషన్‌లో ఉంచి చిత్ర హింసలు పెట్టారని చైతన్య తెలిపారు. నొప్పులకు తాళలేక గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థిని శుక్రవారం పరామర్శించి ఇదే విషయమై డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చైతన్య తెలిపారు.

ఇస్కాన్ ఆలయంలో పిల్లలకు శ్లోకాల్లో శిక్షణ

తెనాలి: స్థానిక నాజరుపేటలోని ఇస్కాన్ ఆలయంలోలోని కళామందిర్‌లో పిల్లలకు భగవద్గీత, రామాయణ, భాగవతాలను నేర్పుతున్నారు. వేసవి సెలవుల్లో ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఇస్కాల్ ఆలయం ఇన్‌ఛార్జి సింహ గురుదాస్ శుక్రవారం తెలియజేశారు. పిల్లలకు శ్లోకాలను చదివించటంతోపాటు వాటి అర్థాన్ని వివరిస్తున్నట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు

పార్టీ కండువాలు కప్పి స్వాగతించిన ఎమ్మెల్యే శివకుమార్



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఒకటో వార్డు కౌన్సిలరు గెడ్డేటి సురేంద్ర, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో 14, 16 వార్డులకు చెందిన టీడీపీ, జనసేనకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వీరికి పార్టీ కండువాలను కప్పి స్వాగతించారు. 14వ వార్డు నుంచి కన్నెగంటి రమేష్‌బాబు, యాతం జయప్రకాష్, మురారి కిరణ్, మేరుగ రాజేష్, 16వ వార్డుకు చెందిన అక్కిదాసు జాలయ్య, మునగపాటి సోమశేఖర్, సొతాని నాగేశ్వరరావు, సిటికేబుల్ బాబు, బోరుగడ్డ బాబ్జి, గంటినపల్లి రవితేజ, మురుగుడు సుబ్బారావు, సాతులూరి సాయికృష్ణ, కొండసింగి రాకేష్, ప్రశాంత్, చీకటి భరత్‌లు పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జూపల్లి వంశీ, ఉన్నవ ప్రశాంత్, యాతాటి అనిల్, బండ్లమూడి నాని, ఉన్నవ నాని, మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, ధర్మరాజుల చెన్నకేశవులు, దాసరి వీరవసంతరావు, ఉన్నవ సాల్మన్, గోళ్ల సందీప్, యనమద్రి శ్యామ్, నీలం సువర్ణరాజు, పల్లె శామ్యూల్ పాల్గొన్నారు.

మూలాంకురేశ్వరికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి అమ్మవారికి చైత్ర బహుళ ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం విశేష పూజలు చేశారు. ప్రాతఃకాలంలో అర్చకులు అయ్యన్నశాస్త్రి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పసుపు, కుంకుమలతో లలితా అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

యడవూరు సమీపంలో అరుదైన శాసనం

- వలయ వామన స్తంభ శాసనంగా గుర్తింపు
- జంపని గొడుగుపాలుని శాసనంగా నిర్ధారణ
- కనుగొన్న చరిత్ర అన్వేషకుడు నల్లగొర్ల వేదాద్రి



అరుదైన శాసనంతో నల్లగొర్ల వేదాద్రి

తెనాలి: పట్టణానికి సమీపంలోని వేమూరు మండల గ్రామం జంపని- యడవూరు గ్రామాల మధ్య అరుదైన శాసనాన్ని చరిత్ర అన్వేషకుడు నల్లగొర్ల వేదాద్రి గుర్తించారు. ప్రముఖ చరిత్రకారుడు రామోజు హరగోపాల్, ఆర్కియాలజిస్ట్, ప్రముఖ స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి శాసనపాఠాన్ని, చారిత్రక సమయాలను నిర్ధారించారు. శ్రీవీరప్రతాప సదాశివదేవ మహారాయలు విజయనగర సామ్రాజ్య పాలన చేస్తున్న(క్రీ.శ 1542-1576) సమయంలో శ్రీరంగరాజపురమనే అగ్రహారపు పొలిమేరల్లో వామన శాసనస్తంభం వేసినట్లు గుర్తించారు. శాసనంలో 'వలయ', 'వామన'లు పేర్కొని ఉన్నాయి. కింది భాగంలో గొడుగు పట్టుకున్న వామనుని శిల్పం ఉండి. గొడుగు పాలుడే వామనుడుగా భావిస్తున్నారు. ఊరికి నాలుగు దిక్కులు, ఎనిమిది మూలల్లో బ్రాహ్మణులు దానం పొందిన సరిహద్దులో ఇవి ఉంటాయి. ఊరిపేరు, బ్రాహ్మణుడి పేరు, దేవుడు పేరుకు మించి శాసనాలపై ఏమీ ఉండదని వివరించారు. ఈ అరుదైన శాసనాన్ని భద్రపరచాలని ప్రభుత్వానికి సూచించారు.

వాహనాల తనిఖీలు

పట్నంబజారు: ఎన్నికల ప్రక్రియలో భాగంగా గుంటూరు జిల్లాలో రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. శుక్రవారం గుంటూరు బుడంపాడు బైపాస్, నల్లచెరువు, ఆర్టీఓలు ఎం.గోపాల్, ప్రసాద్, ఎంవీఐలు రాఘవరావు, అనిల్ కుమార్, మల్లేశ్వరి, సంధ్య, సౌజన్యలతో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

మైనారిటీ సబ్ కోటా రద్దుపై మాట్లాడటం సిగ్గు చేటు

లక్ష్మీపురం: జాతీయస్థాయిలో ఓబీసీ రిజర్వేషన్లలో మైనారిటీ సబ్ కోటా రద్దుపై నోరు ఎత్తని రాజకీయ పార్టీలు ఈరోజు దాదాపు 12 సంవత్సరాల తర్వాత ఎన్నికల సమయంలో మాట్లాడటం సిగ్గు చేటు అని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ అధ్యక్షులు మహమ్మద్ కలీం పేర్కొన్నారు. స్థానిక తూర్పు నియోజక వర్గ పరిధిలోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 4శాతం రిజర్వేషన్లు కల్పించడంపై దాదాపు రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలు స్వాగతిస్తూ ప్రకటనలు ఇచ్చాయి. సఖ్యతగా ఉంటున్న బీసీ, ముస్లిం వర్గాల మధ్య రాజకీయ చిచ్చు కోసం ఇటువంటి ప్రయత్నాలు చేయటం తగదని చెప్పారు. 2012లో న్యాయస్థానాన్ని ఆశ్రయించిన ఆర్ కృష్ణయ్య ను 2014లో తెలంగాణ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటన చేసి ఎమ్మెల్యే గా పోటీ చేయించిన పార్టీ కు ఆ పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గుర్తుకు రాని జాతీయ స్థాయిలో ఓ బి సి కోటాలో మైనారిటీ సబ్ కోటా రిజర్వేషన్ల రద్దు, ఇప్పుడు గుర్తుకు రావడం అందులోనూ ఎన్నికల సమయంలో గుర్తుకు రావటం కేవలం ఎన్నికల జిమ్మిక్కు అని స్పష్టంగా అర్థమవుతుందని తెలిపారు.

వేసవి శిక్షణతో సృజనాత్మక నైపుణ్యాలకు పదును

గుంటూరు ఎడ్యుకేషన్: బాలల్లో దాగిన సృజనాత్మక నైపుణ్యాలకు పదును పెట్టేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదం చేస్తాయని హైదరాబాద్‌కు చెందిన లిటిల్ ఎడ్యు ఎంటర్‌ప్రైజెస్ సీఈఓ రమణకుమార్ పేర్కొన్నారు. అరండల్‌పేట ఆరోలైనులోని హిందూ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం లిటిష్ ఎడ్యు సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా రమణకుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా లిటిష్ సంస్థ చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకత నైపుణ్యాలను వెలికితీసేందుకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న విధంగా గుంటూరు నగరంలోని చిన్నారుల కోసం హిందూ పబ్లిక్ స్కూల్లో ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హిందూ ప్రాథమికోన్నత పాఠశాల కార్యదర్శి రామకృష్ణ పరమహంస మాట్లాడుతూ చిన్నారుల్లో ఆహ్లాదాన్ని పంచేందుకు డ్యాన్స్, ఏరోబిక్స్, వేద గణితం, చిత్రకళతో పాటు చిన్నారులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు వివిధ అంశాల్లో శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఇంటింటి ప్రచారంలో శివకుమార్‌కు ఘనస్వాగతం



35వ వార్డులో హారతినిస్తున్న మహిళ

తెనాలి: నియోజకవర్గంలో అందుబాటులో ఉంటూ గరిష్ఠంగా సంక్షేమ లబ్ధిని కలిగించి అభివృద్ధికి పాటుపడిన ఎమ్మెల్యేగా తనకు మరోసారి అవకాశం కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విజ్ఞప్తిచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణ 35వ వార్డులోని ఆర్యవైశ్యుల ఇంటింటికీ తిరిగి మద్దతు కోరారు. అన్నిచోట్లా ఆయనకు సాదర స్వాగతం లభించింది. కొందరు శాలువాలతో సత్కరించి సంతోషపడితే, మరికొందరు మహిళలు హారతులు ఇచ్చారు. కొబ్బరికాయలతో దిష్టితీసి, ఎన్నికల్లో విజయం సాధించాలని ఆశీర్వదించారు. ప్రచార కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గొడవర్తి సాయిహరేరామ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, దేసు శ్రీనివాసరావు, కొల్లా గురునాధగుప్త, ఆలమూరి ఫణి, యిడపలపాటి వాసు, నేరెళ్ల రాము, చెంచురామయ్య, పోలురాజు, నాగార్జున, గుండం శ్రీను, ఆవుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు మేలు

జై భీమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కఠెవరపు దేవానంద్



ఇంటింటి ప్రచారం చేస్తున్న జై భీమ్ ఫౌండేషన్ ప్రతినిధులు

తెనాలి అర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని జై భీమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కఠెవరపు దేవానంద్ అన్నారు. జై భీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెనాలి మండలం చావావారిపాలెం, సంగంజాగర్లమూడి గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ గెలుపును ఆకాంక్షిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజు వివిధ గ్రామాల్లో తమ ఎన్నికల ప్రచారం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎం. ఎస్తేర్‌రాణి, చిలకా సుమతీ, కనపర్తి రజనీ, గేరా విజయ, డేవిడ్ రాజు, యువజన విభాగం సభ్యులు ఎస్ విజయ్, పి. సురేంద్ర, సీహెచ్ అవినాష్, ఎస్. వంశీ, ఎం. రాజేష్, పి. రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నేతలు



ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులు

తెనాలి రూరల్: తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామంలో జనసేన పార్టీకి షాక్ తగిలింది. గ్రామానికి చెందిన ఆ పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామంలో శివకుమార్ ప్రచారం గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ జనసేన నాయకుడు కురంగి విజయభాస్కర్ ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. బత్తిన జయప్రకాష్, దేవిశెట్టి వెంకట్రావు, వంశీ, మానికల శ్రీను, కిరణ్‌కుమార్, మానికల లావణ్య, కోటి, చిట్టిబాబు, మానికల నాగరాజు, ఈవూరి సువార్త, చెంచయ్యల కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ వీరికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. పాలడుగు సాంబశివరావు, రెడ్డి శ్రీనివాస్, అరుణ్‌కుమార్, శివరామిరెడ్డి, సాల్మన్, కనకసుందరం, సురేష్, గోపినాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌లో త్రీడీ శిల్పకళా ప్రదర్శన

- తెనాలి శిల్పకారుడు శ్రీహర్ష రూపొందించిన శిల్పాలు
- ప్రారంభించనున్న సినీదర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ



కాటూరి శ్రీహర్ష





ప్రదర్శనలో ఉంచనున్న శిల్పాల్లో ఒకటి

తెనాలి: బుల్లి శిల్పాల రూపశిల్పిగా జాతీయ అంతర్జాతీయ ప్రాచుర్యం సాధించిన పట్టణానికి చెందిన యువ శిల్పకారుడు కాటూరి శ్రీహర్ష త్రీడీ టెక్నాలజీతో రూపొందించిన వివిధ శిల్పాలతో హైదరాబాద్‌లో ప్రదర్శన నిర్వహించనున్నారు. 'యానిమల్ థీమ్' పేరుతో మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటుచేసిన శిల్పకళా ప్రదర్శనను శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రముఖ సినీదర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ ప్రారంభిస్తారు. తెలంగాణ భాషా సాంస్కృతిక విభాగం డైరెక్టర్ మామిడి హరికృష్ణ, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ టి.గంగాధర్, ఆర్కియాలజిస్ట్ ఈమని శివనాగిరెడ్డి, సినీ నిర్మాత తుమ్మల ప్రసన్నకుమార్, సంగీత దర్శకుడు మహిత్ నారాయణ, నటుడు శ్రావణ్ రాఘవేంద్ర, దర్శకుడు గగన్‌రెడ్డి, ప్రజాగాయకుడు ఏలూరి రాజేశ్వరరావు పాల్గొంటారని శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదర్శన ఈనెల 13వ తేదీవరకు ఉంటుందని తెలిపారు. పట్టణానికి చెందిన ప్రముఖ శిల్పకారుడు కాటూరి వెంకటేశ్వరరావు రెండో కుమారుడు శ్రీహర్ష. విజువల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందారు. డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీలో కృషిచేశారు. 3డీ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. అంగుళం నుండి అతి పెద్ద విగ్రహాల వరకు ఇదే టెక్నాలజీలో శిల్పాలను తయారుచేస్తున్నారు. శ్రీహర్ష సోదరుడు రవిచంద్ర శిల్పకళలో అంతర్జాతీయ ఖ్యాతి పొందారు.

విద్యావంతులు సామాజిక స్పృహతో మెలగాలి

సామాజిక రంగ ప్రముఖుల సమ్మేళనంలో సందేశమిచ్చిన వక్తలు



సమ్మేళనంలో ప్రసంగిస్తున్న నిషాంత్ అగర్వాల్

మంగళగిరి: ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో శుక్రవారం విద్యావంతులు, సామాజిక రంగ ప్రముఖుల ప్రత్యేక సమ్మేళనం నిర్వహించారు. ఈశ్వరీ స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చర్చాగోష్టి కార్యక్రమానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రఖ్యాత విద్యావంతులు, సామాజిక రంగ ప్రముఖులు హాజరయ్యారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ ప్రొఫెసర్ డాక్టర్ వందనా స్వామి, డీన్ ఆచార్య విష్ణుపథ్‌ల పర్యవేక్షణలో చర్చాగోష్టి కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది. ప్రఖ్యాత విద్యా సంస్థ అక్సామ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమితాబ్ బెహర్ ముఖ్య అతిథిగా దృశ్య మాధ్యమ పద్ధతిలో హాజరయ్యారు. పౌర సమాజ పురోగతిలో సామాజిక రంగ ప్రముఖుల పాత్ర ప్రశంసనీయమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో సామాజిక రంగం ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. జాతి పురోగతికి దోహదపడే సామాజిక బాధ్యతల్ని విద్యావంతులు, విద్యార్థులు విస్మరించకూడదని హితవు పలికారు. ప్రఖ్యాత విద్యా సంస్థల ప్రతినిధులు లిబీ జాన్సన్, సూరజ్ జాకబ్, రోనక్ షా, నిషాంత్ అగర్వాల్, యామినీ అయ్యార్ తదితరులు సమాజానికి దోహదపడే వివిధ సామాజిక రంగ అంశాలపై సమీక్ష నిర్వహించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com